# ప్రభాత సూర్యుడు

తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME : 81 EDITOR:CHERUKU UPENDAR, DATE : FRIDAY 21 JULY 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 81 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : శుక్రవారం 21 జులై 2023 పేజీలు : 4 వెల : 5/-


## ప్రధాని మోడీని కలిసిన పొంగులేటి సుధాకర్ రెడ్డి

న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు



భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరియు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా లను బిజెపి తమిళనాడు సహ ఇన్‌చార్జి, తెలంగాణ బీజేపీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటి సభ్యుడు,మాజీ ఎమ్మెల్సీ

మిగతా 2లో...

## మణిపూర్ ఘటనపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- సుమోటోగా స్వీకరించిన ధర్మాసనం..
- రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతుంటే ఏం చేస్తున్నారు



న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు

మణిపూర్‌లో కుకీ తెగకు చెందిన మహిళను నగ్నంగా ఊరేగించిన ఘటనపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ దాడి ఘటనను మణిపూర్ మహిళలపై అమానవీయ చర్యలను ఖండించింది. రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతుంటే ఏం చేస్తున్నారని నిలదీసింది. నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలపాలని ఆదేశించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే తామే చర్యలకు ఉపక్రమిస్తామని స్పష్టం చేసింది. తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది.మణిపూర్‌లో చెలరేగిన అల్లర్ల మాటున మహిళలపై

మిగతా 2లో...

## ఉచిత విద్యుత్తుతో బీఆర్ఎస్ దండయాత్ర

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

▶ కాంగ్రెస్ ను టార్గెట్ చేస్తూ ధర్నాలు, రైతు సమ్మేళనాలు ▶ అన్ని వర్గాలను ఏకం చేసే పనిలో పడ్డ గులాబీ టీం

ఉచిత కరెంటుతో కాంగ్రెస్ పై ఊపందుకున్న బీఆర్ఎస్ దండయాత్ర రకరకాలుగా కొనసాగుతూనే ఉంది. టార్గెట్ కాంగ్రెస్ గా గులాబీ బాస్ కేసీఆర్ తన వ్యూహాలకు రోజుకో రూపం ఇస్తున్నారు. ఇప్పటికే ఉచిత కరెంటు విషయం లో కాంగ్రెస్ ను టార్గెట్ చేస్తూ ధర్నాలు, రైతు సమ్మేళనాలు కాంగ్రెస్ వ్యతిరేక తీర్మానాలు చేస్తోంది బీఆర్ఎస్. ఇప్పుడు ఎవరూ ఊహించని విధంగా పార్టీలోని బీసీ నాయకులను ఏకం చేసి రాష్ట్ర వ్యాప్తంగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బీసీల పట్ల వ్యవహరిస్తున్న తీరు వాడుతున్న భాష బాగాలేదు అవమానంగా ఉంది అంటూ కొత్త పల్లవి ఎత్తుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా బీసీలను ఏకం చేసి భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి కాంగ్రెస్ నాయకుల తీరును ప్రజల్లోకి తీసుకెళతాం అని పిలుపునివ్వడం ఇప్పుడు కొత్త చర్చకు దారి తీసింది. ఇప్పటికే సొంత పార్టీలోనే బిసి నాయకులూ ఏకం అవ్వడం మాకు న్యాయం కావాలి అంటూ ప్రత్యేక సమావేశాలు పెట్టుకోవడం లాంటి కార్యక్రమాలతో కాంగ్రెస్ అధిష్టానము తలలుపట్టుకుంటోంది. ఇప్పుడు బిఆర్ఎస్ కూడా బిసి నాయకులను రేవంత్ రెడ్డి బాడీ షేమింగ్ చేస్తున్నారు అంటూ అటాక్ చెయ్యడం ఆ పార్టీకి ఇబ్బందిగా మారింది అని చర్చ మొదలయింది. ఇక బీసీల విషయం అలా ఉంటే మైనార్టీలను కూడా కదిలించే పనిలో పడ్డారు బీఆర్ఎస్ పెద్దలు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో మైనారిటీ ప్రజాప్రతినిధులతో సమావేశం పెట్టి అసలు బిసి ల పట్ల బిఆర్ ఎస్ ఎలా ఉంది ఎన్ని కార్యక్రమాలు చేసింది విపక్షలా తీరు ఎలా ఉంది మైనార్టీల పట్ల అనే

మిగతా 2లో...

## కుదిపేసిన మణిపూర్ అంశం..

## ఉభయ సభలు రేపటికి వాయిదా

న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు



హింస, అల్లర్లతో అట్టుడుకుతున్న ఈశాన్య రాష్ట్రం మణిపూర్ అంశం పార్లమెంట్ కుదిపేస్తోంది. ఆ రాష్ట్రంలో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనతో ఎగువ, దిగువ సభల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఉదయం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కాగా.. మణిపూర్ పరిస్థితిపై చర్చించాలంటూ ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. దీంతో ఉభయ సభల్లో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో ఉభయ సభలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి.పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గురువారం ఉదయం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఉదయం 11 గంటలకు ఉభయ సభలు సమావేశమయ్యాయి. లోక్ సభలో స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభలో చైర్మన్ జగ్ దీప్ ధన్ ఖడ్ సభా సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆ

మిగతా 2లో...

## కిషన్ రెడ్డి అరెస్ట్... హై డ్రామా



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

నేనేమైనా టెర్రరిస్టునా? నా బండినే ఆపుతారా?.. కేంద్ర మంత్రి కాన్వాయ్‌కి వెహికిల్ అడ్డం పెడతారా..? లా అండ్ ఆర్డర్ బాధ్యత నాపై కూడా ఉంది.. డబుల్ బెడ్రూం ఇళ్ళను పరిశీలిస్తే మీకేంటి బాధ.. అంటూ కేంద్ర మంత్రి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి హైదరాబాద్ పోలీసులపై ఫైర్ అయ్యారు. డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించేందుకు వెళ్తే మీకేంటంటూ పోలీసులను ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తీరును ఎండగడుతూ.. బాట

మిగతా 2లో...

## తెలంగాణ సీజేగా అలోక్





హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

తెలంగాణ హైకోర్టుకు ఇద్దరు కొత్త జడ్జీలు నియమితులయ్యారు. రాష్ట్రానికి కొత్త సీజే నియామకం జరిగింది. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ అరాధే నియమితులయ్యారు. జస్టిస్ అలోక్ అరాధే ప్రస్తుతం కర్ణాటక హైకోర్టు

మిగతా 2లో...

## నడ్డాతో పవన్ భేటీ



న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు

జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో సమావేశం అయ్యారు. పవన్ వెంట నాదెండ్ల మనోహర్ కూడా ఉన్నారు. వీరి మధ్య దాదాపుగా అరగంట సేపు చర్చలు జరిగాయి. రాష్ట్ర రాజకీయాలపైనే ప్రధానంగా చర్చించినట్లుగా తెలుస్తోంది. పవన్ కల్యాణ్‌తో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, ప్రజల సంక్షేమంపై చర్చించామని జేపీ నడ్డా ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. ఏపీలో ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితుల మధ్యే పవన్, నడ్డా ఎక్కువగా చర్చించినట్లుగా తెలుస్తోంది. ఏపీ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత, కేంద్రం వద్ద ఉన్న నివేదికలు, ఇతర అంశాలతో..తదుపరి ఏం చేయాలన్నదానిపై చర్చించినట్లుగా తెలుస్తోంది. బీజేపీ , జనసేన కలిసి

మిగతా 2లో...

## బీఆర్ఎస్‌పై యుద్ధం మొదలైంది

### ఆట మీరే మొదలు పెట్టారు : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

- ▶ దమ్ముంటే 50 లక్షల ఇండ్లు కట్టాలి ▶ పేదలకు ఇండ్లు కట్టేందుకు డబ్బులు ఉండవా ?
- ▶ 9 ఏండ్లలో ఒక్క రేషన్? కార్డు కూడా ఇవ్వలేదు
- ▶ రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ఫైర్
- ▶ బాటసింగారం డబుల్ ఇండ్ల వద్దకు వెళ్లకుండా అడ్డుకోవడంపై కేసీఆర్‌పై మండిపాటు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



బీఆర్?ఎస్?పై యుద్ధం మొదలైందని కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు జి. కిషన్? రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మొదలు పెట్టిన యుద్ధానికి తాము సిద్ధమన్నా రు. రెండు పడక గదుల ఇళ్ల పరిశీలనకు శంషాబాద్ నుంచి బాటసింగారం బయలుదేరిన కిషన్‌రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. ఆపై అదుపులోకి తీసుకొని నగరంలోని వివిధ ప్రాంతాల్లో తిప్పుతూ.. నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయం వద్ద విడిచి పెట్టారు. అనంతరం అక్కడ

మిగతా 2లో...

## మైనారిటీలకు లక్ష రూపాయల స్కీం



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

జలవిహార్ లో మైనార్టీనేతల సమావేశంలో మంత్రులు హరీష్ రావు,మహమూద్ అలీ,ఎంపీ రంజిత్ రెడ్డి,ఎమ్మెల్యేలు షకీల్, దానం నాగేందర్, ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్, పలు మైనార్టీ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు. పలు మైనార్టీ కార్పొరేషన్లకు చైర్మన్లుగా నియమితులైనవారిని మంత్రులు సన్మానించారు.

మిగతా 3లో...

# ఉచిత విద్యుత్తుతో బీఆర్ఎస్ దండయాత్ర

(మొదటి పేజీ తరువాయి)

విషయం పై చర్చించబోతున్నట్టు సమాచారం. ఇలా ఒక్కో సామజిక వర్గం ఒక్కో అంశం తో అన్ని వర్గాలను ఏకం చేసే పనిలో పడ్డ గులాబీ టీం విపక్షాలకు ఇబ్బందిగా మారింది అని రాజకీయ వర్గాల్లో చర్చ మొదలయింది. కరెంట్ విషయం లో సక్సెస్ అయ్యామని భావిస్తున్న బిఆర్ ఎస్ ఇక అంశాల వారీగా విపక్షలను టార్గెట్ చెయ్యాలని భావిస్తున్నట్టు తెలుస్తుంది మరి ముఖ్యంగా వ్యక్తిగత విమర్శలను ఉపేక్షించేది లేదు అన్నది బీఆర్ఎస్ విధానమని తెలుస్తుంది.

# మణిపూర్ ఘటనపై సుప్రీంకోర్టు ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

దారుణాలు జరుగుతున్నట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించిన ఘటన తాజాగా బయటపడింది. మే 4న కాంగ్‌పోక్పి జిల్లాలో జరిగిన ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరితో అక్కడి మహిళలు తీవ్ర వ్యధను అనుభవించారు. ఓ వర్గం వారు ప్రత్యర్థి వర్గానికి చెందిన ఇద్దరు మహిళలను వివస్త్రలను చేశారు. అనంతరం వారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. నిస్సహాయ స్థితిలో ఉన్న వారి ఆర్తనాదాలను ఎవరూ పట్టించుకోకుండా వికృతంగా ప్రవర్తించారు. ఈ ఘటనపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధోరణి కారణంగానే దారుణాలు జరుగుతున్నట్టు పలువురు మండిపడుతున్నారు.

**ఆ వీడియోలు తొలగించండి.. కేంద్రం ఆదేశాలు**

ఈ క్రమంలో మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన వీడియో వైరల్ కావడంపై కేంద్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ వీడియోలను వెంటనే తొలగించాలని ట్విట్టర్‌తో సహా ఇతర అన్ని సోషల్ మీడియా సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. శాంతి భద్రతలు, ఇతర కారణాల దృష్ట్యా తక్షణమే వీడియోలను తొలగించాలని ఆదేశించింది. భారతీయ చట్టాలకు కట్టుబడి ఉండాలని సూచించింది.

# నడ్డాతో పవన్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

పని చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ఓట్లు చీలకుండా ఉండాలంటే ఏం చేయాలన్న దానిపైనా చర్చించినట్లుగా చెబుతున్నారు . గత రాత్రి కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోనూ పవన్ కల్యాణ్ సమావేశం అయ్యారు. పవన్ కల్యాణ్ ఎలాంటి అధికారిక హోదాలో లేరు. బీజేపీ మిత్రపక్షంగా మాత్రమే కలుస్తున్నారు. అందుకే కేవలం రాజకీయ అంశాలే మాట్లాడి ఉంటారని భావిస్తున్నారు. ఎన్డీఏ మీటింగ్ కోసం ఢిల్లీ వెళ్లిన పవన్.. సమావేశంలో ప్రధానమంత్రితోనూ మాట్లాడారు. ఆ తర్వాత ఏపీ బీజేపీ వ్యవహారాల ఇంచార్జ్ మురళీధరన్ తో పాటు... హోంమంత్రి అమిత్ షాతో కూడా చర్చించారు. దీంతో బీజేపీ అగ్రనేతలందరితో సమావేశమయ్యారు. తిరికి ఆయన ప్రత్యేక విమానంలో గన్నవరం తిరిగి రానున్నారు. సాయంత్రం.. జనసేన పార్టీలో చేరేందుకు పంచకర్ల రమేష్ బాబు విశాఖ నుంచి మంగళగిరి వస్తున్నారు. నాలుగు గంటలకు పంచకర్ల రమేష్ బాబు చేరిక ప్రోగ్రాం ఉంటుందని ఇప్పటికే జనసేన నాయకులు ప్రకటించారు. ఇక ఢిల్లీలో ఎలాంటి సమావేశాలు లేనందున పవన్ కల్యాణ్ కూడా వెంటనే తిరుగు పయనమయినట్లుగా తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వాన్ని ఓడించాలని .. ఓట్లు చీలకుండా చూసుకోవాలని పవన్ కల్యాణ్ టార్గెట్ గా పెట్టుకున్నారు. టీడీపీ, బీజేపీతో కలిసి పోటీ చేయాలని ఆయన అనుకుంటున్నారు. ఈ క్రమంలో పవన్ ఢిల్లీ పర్యటనలో ఎలాంటి ముందడుగు పడిందనేది కొద్ది రోజుల్లో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# ఎడతెరిపి లేకుండా వానలు

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

ఉత్తర తెలంగాణ ప్రజలకు రెడ్ అలర్ట్, కాదుకాదు డేంజర్ వార్నింగ్ ఇది, అప్రమత్తంగా లేకపోతే ఇబ్బందుల్లో పడటం ఖాయం. అవును, మీరు వింటున్నది నిజమే. తెలంగాణకు డేంజర్ వార్నింగ్ ఇచ్చింది వాతావరణశాఖ. 13 జిల్లాల్లో క్లౌడ్ బరస్ట్ ఖాయమని హెచ్చరించింది. మరో నాలుగైదు రోజులపాటు కుండపోత వర్షాలు కురుస్తాయని చెబుతోంది. ఇప్పటికే గోదావరి పరివాహక జిల్లాల్లో వరద నీరు పోటెత్తుతోంది. ముసురుపట్టి కురుస్తోన్న వర్షాలకు తోడు, ఎగువ నుంచి వస్తోన్న వరద ప్రవాహంతో వాగులు, వంకలు ఉగ్రరూపం దాల్చుతున్నాయ్!..ఉత్తర తెలంగాణకు రెడ్ అలర్ట్ ప్రకటించిన వాతావరణశాఖ.. ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. అలాగే, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, సిద్దిపేట, కామారెడ్డి, జగిత్యాల, భూపాలపల్లి, నిజామాబాద్, కామారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడనున్నట్టు చెప్పింది. ఆదిలాబాద్, కుమురంభీమ్, మంచిర్యాల, నిర్మల్, సిరిసిల్ల, మెదక్, మేడ్చల్, సంగారెడ్డి, రంగారెడ్డిలో భారీ వర్షాలు కురుస్తాయంటోంది వెదర్ డిపార్ట్‌మెంట్. రాగల 24 గంటల్లో వాయువ్య, పశ్చిమ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని.. వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.

# తెలంగాణ సీజేగా అలోక్

(మొదటి పేజీ తరువాయి)

జడ్జిగా కొనసాగుతున్నారు. ఛత్తీస్‌గఢ్ హైకోర్టు జడ్జిగా సేవలు అందిస్తున్న మరో జడ్జి జస్టిస్ సామ్ కొశాయ్ తెలంగాణ హైకోర్టు జడ్జిగా ట్రాన్స్ ఫర్ అయ్యారు. పలువురు జడ్జిల బదిలీలకు సుప్రీంకోర్టు కొలీజియం జులై 5న సిఫారసు చేయడం తెలిసిందే. మొత్తం ఐదుగురు జడ్జిల బదిలీకి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తెలంగాణ హైకోర్టుతో పాటు కేరళ, ఒడిశా, గుజరాత్ రాష్ట్రాల హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులను కేంద్ర ప్రభుత్వం నియించినట్లు ప్రకటించింది.

ఈ వివరాలను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ట్విట్టర్ లో పోస్ట్ చేశారు. గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సునితా అగర్వాల్ నియమితులయ్యారు. ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టులో జడ్జిగా సేవలందిస్తున్నారు. కేరల హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఆశిష్ జే దేశాయ్ నియమితులయ్యారు. వారు ప్రస్తుతం గుజరాత్ హైకోర్టుకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా చేస్తున్నారు. ఒడిశా హైకోర్టు సీజేగా సుభాషిస్ తలపత్ర నియమితులు కాగా, ప్రస్తుతం అదే కోర్టులో జడ్జిగా వ్యవహరిస్తున్నారు. ఒడిశా హైకోర్టు ప్రస్తుత సీజే ఎస్ మురళిధర్ ఆగస్టు 7న రిటైర్మెంట్ కానున్నారు.

**తెలంగాణ హైకోర్టు కొత్త సీజే ప్రస్థానమిలా..**

జస్టిస్ అలోక్ అరాధే 1964 ఏప్రిల్ 13న ప్రస్తుత ఛత్తీస్ గఢ్ రాష్ట్రంలోని రాయ్ పూర్ లో జన్మించారు. 1988లో న్యాయవాదిగా కెరీర్ ప్రారంభించారు. ఈ క్రమంలో 2009 డిసెంబరు 29న మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. అనంతరం 2016 సెప్టెంబరు 16న జమ్మూ కశ్మీర్ న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. ఆ రాష్ట్ర జ్యూడీషియల్ అకాడమీకి, లీగల్ సర్వీసెస్ అథారిటీకి ఛైర్మన్ గా నియమితులై సేవలు అందించారు. 2018లో 3 నెలల పాటు జమ్ము కశ్మీర్ హైకోర్టు తాత్కాలిక సీజేగా వ్యవహరించారు. 2018 నవంబరు 17 నుంచి కొంతకాలం కర్ణాటక హైకోర్టు జడ్జిగా చేశారు. ఆపై అదే రాష్ట్ర హైకోర్టు సీజేగా నియమితులై సేవలందించారు. ఇటీవల కొలీజియం కొందరు జడ్జీల పేర్లను సిఫార్సు చేయడం, అందుకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేయడంతో బుధవారం తెలంగాణ హైకోర్టు సీజేగా నియమితులయ్యారు.

## కుదిపేసిన మణిపూర్ అంశం..

# ఉభయ సభలు రేపటికి వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత ఇటీవలే మృతి చెందిన సిట్టింగ్ సభ్యులు, మాజీ ఎంపీలకు ఉభయ సభలు సంతాపం ప్రకటించాయి. అనంతరం లోక్ సభను మధ్యాహ్నాం 2 గంటలకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. ఆ వెంటనే రాజ్యసభ ను కూడా మధ్యాహ్నాం 12 గంటలకు వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు.అనంతరం తిరిగి ఉభయ సభలు ప్రారంభం కాగానే ప్రతిపక్షాలు మణిపూర్ పరిస్థితిపై చర్చించాలని పట్టుబడ్డాయి. చైర్మన్ ఎంత చెప్పినా వినకుండా విపక్షాలు సభలో నిరసనకు దిగారు. దీంతో రాజ్యసభ మధ్యాహ్నాం 2 గంటలకు వాయిదా పడింది. ఆ తర్వాత కూడా నిరసనలు కొనసాగడంతో చైర్మన్ సభను రేపటికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అటు లోక్ సభలోనూ ఇదే పరిస్థితి. మణిపూర్ పరిస్థితిపై ప్రధాని స్పష్టమైన ప్రకటన చేయాలంటూ విపక్ష నేతలు పట్టుబడటంతో గందరగోళం నెలకొంది. దీంతో సభను రేపటికి వాయిదా వేస్తూ స్పీకర్ ప్రకటించారు.

# బీఆర్ఎస్‌పై యుద్ధం మొదలైంది

(మొదటి పేజీ తరువాయి)

కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. రెండు పడక గదుల ఇళ్ల గురించి తెలుసుకోవడానికి వెళ్లే హక్కు కూడా కేంద్ర మంత్రిగా తనకు లేదా? అని ప్రశ్నించారు. ఒక నేరస్థుడితో, ఉగ్రవాదితో ఎలా వ్యవహరిస్తారో.. ఇవాళ తనతో పోలీసులు అలా వ్యవహరించారని మండిపడ్డారు. ప్రశ్నించే గొంతులను ప్రగతి భవన్‌లో కూర్చొని అణిచివేస్తారా? అని దుయ్యబట్టారు. " తెలంగాణలో పేద ప్రజలకు న్యాయం జరగడం లేదు. రెండు పడక గదుల ఇళ్లూ వారికి ఇవ్వడం లేదు. భారాసపై మా ఉద్యమం ఇంకా పూర్తి స్థాయిలో ప్రారంభించలేదు. బాటసింగారంలో మధ్యలోనే వదిలేసిన ఇళ్లను చూద్దామని బయలుదేరాం. శంషాబాద్ విమానాశ్రయం వద్ద నన్ను అడ్డుకున్నారు. పలువురు నేతలనూ అరెస్ట్ చేశారు. ఇవాళ ధర్నా, ఆందోళన కాదని చెప్పినా.. పోలీసులు మా పట్ల నియంతృత్వ ధోరణితో వ్యవహరించారు. బడుగు బలహీనవర్గాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు తెలుసుకోవడానికి వెళ్తే ఇలా వ్యవహరిస్తారా?తండ్రిని అడ్డం పెట్టుకొని మాకు పదవులు రాలేదుఒక నేరస్థుడితో, ఉగ్రవాదితో ఎలా వ్యవహరిస్తారో.. నాతో అలా వ్యవహరించారు. పోలీస్ కమిషనర్, డీసీపీలు కలిసి అమానుషంగా ప్రవర్తించారు. కల్వకుంట్ల కుటుంబ పాలనలో ప్రజలు తమ నీడను తామే చూసుకొని భయపడాల్సి వస్తోంది. ఇచ్చిన హామీల్లో సీఎం కేసీఆర్ ఏ ఒక్కటీ అమలు చేయలేదు. ప్రజల ఆవేదన, ఆక్రోశం.. భాజపా నేతల అరెస్టులతో తగ్గదు. ఈరోజు యుద్ధం మొదలైంది. కల్వకుంట్ల కుటుంబం, భారాసతో యుద్ధానికి మేం సిద్ధం. ప్రజల సమస్యల తరఫున ఈ యుద్ధం కొనసాగిస్తాం. మా రాజకీయ జీవితమే పోరాటాలతో ప్రారంభమైంది. ఎన్నో సార్లు జైలుకు వెళ్లాం. తండ్రిని అడ్డం పెట్టుకొని మాకు పదవులు రాలేదు. భారాస పాపాలు పండాయి. తెలంగాణ మేధావులు, కవులు, కళాకారులు ఇవాళ్టి పరిణామాలపై ఆలోచించాలి" అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ కు దమ్ముంటే తెలంగాణలో 50 లక్షల ఇండ్లు కట్టాలని సవాల్ విసిరారు. 50 లక్షల ఇండ్లకు కేంద్ర ప్రభుత్వం వాటా తెచ్చే బాధ్యత తనదేనన్నా రు. బీఆర్ఎస్ ను గద్దెదించే వరకు పోరాటం చేస్తామన్నారు. ఖరీదైన ఇళ్లు కట్టుకోవడానికి, విమానాలు కొనడానికి కేసీఆర్ కు డబ్బులుంటాయి కానీ పేద ప్రజలకు ఇళ్లు కట్టడానికి డబ్బులుండవని ప్రశ్నించారు. పేదల పట్ల బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నా రు. అరకొరగా కట్టిన ఇండ్లు కూడా 9 ఏళ్లుగా ఎవరికి ఇవ్వ లేదన్నా రు. తొమ్మిది సంవత్సరాలైనా ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేని, చేతకాని ప్రభుత్వం అంటూ విమర్శించారు. కేసీఆర్ అభద్రతాభావంతో ఉన్నారు కాబట్టే బీజేపీ నేతలను అరెస్ట్ చేశారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. నన్ను చంపేయండి..నేను ఇంటికి మాత్రం వెళ్ళనుఅంతకు ముందు ఆయన ఢిల్లీ నుంచి శంషాబాద్ఎయిర్? పోర్ట్?కు చేరుకోగానే.. పోలీసులు బాటసింగారంలోని డబుల్? ఇండ్లను పరిశీలించేందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. కాగా భారీ వర్షంలోనూ కేంద్ర మంత్రి కిషన్? రెడ్డి శంషాబాద్? ఔటర్ రింగ్ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

పోలీసులు అడ్డుకోవడం పట్ల ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఎన్ని అడ్డంకులు సృష్టించిన బాట సింగారం వెళ్లి తీరుతా. నేనేమైనా క్రిమినల్ నా? కేంద్ర మంత్రిని అడ్డుకుంటారా? పోలీసు వెహికిల్ అడ్డుపెట్టి ఆపుతారా? నిజాం కన్నా అధ్వానమైన పాలన ఇక్కడ ఉంది' అని మండిపడ్డారు. 75 ఏళ్ల భారతదేశ చరిత్రలో తొలిసారిగా ఓ కేంద్ర కేబినెట్ మంత్రిని ప్రజాసమస్యలను పరిశీలించేందుకు వెళ్తుండగా అక్రమంగా అరెస్టు చేశారని, పార్లమెంటు స్పీకర్ కు ఫిర్యాదు చేస్తానన్నారు. కేసీఆర్ తొత్తుల్లాగా కాకుండా ప్రజాసేవకుల్లా పోలీసులు వ్యవహరిం చాలన్నారు. కేంద్రమంత్రి కాన్వాయ్ కు డీసీఎంను అడ్డంపెట్టి ఆపేంత అవసరం ఏమొచ్చింది? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో దౌర్జన్య పాలన నడుస్తోం దన్నారు. కల్వకుంట్ల కుటుంబం జైలులో గదులు రెడీ చేసుకోవాలని హెచ్చరించారు. కల్వకుంట్ల కుటుంబ పాలనలో రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు ఏర్పడ్డాయని కిషన్ రెడ్డి విమర్శించారు. అనంతరం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రఘునందన్ రావులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## పెట్రోల్ ధరలు ఏపీలోనే అధికం..

న్యూఢిల్లీ- ప్రభాత సూర్యుడు

దేశ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు మండిపోతున్న విషయం తెలిసిందే. పెట్రోల్ ధరల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రస్థానంలో నిలవగా, డీజిల్ రేట్లలో లక్షద్వీప్ తొలి స్థానంలో నిలిచింది. ఏపీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 111.87 గా ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. లక్షద్వీప్‌లో లీటర్ డీజిల్ ధర రూ. 103. 08గా ఉంది. అరుణాచల్ ప్రదేశ్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ. 92.78 గా ఉంది. పెట్రోల్, డీజిల్, ఇతర పెట్రోలియం ఉత్పత్తులను దేశమంతా ఒకే ధరల విధానం ప్రవేశపెట్టే అవకాశం ఉందా? అని రాజస్థాన్‌కు చెందిన బీజేపీ ఎంపీ రాహుల్ కశ్వాన్ అడిగిన ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ వివరాలు వెల్లడించారు. దేశ వ్యాప్తంగా ఒకే చమురు ధరల విధానం ఇప్పటి వరకు లేదన్న ఆయన.. ఆయా రాష్ట్రాల్లో పన్ను ఆధారంగా ధరలు ఉన్నట్టు తెలిపారు.

## ప్రధాని మోడీని కలిసిన

# పొంగులేటి సుధాకర్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి గురువారం డిల్లీ లో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా తమిళనాడు మరియు తెలంగాణ రాష్ట్రం లో భారతీయ జనతా పార్టీ అధికారమే లక్ష్యంగా కొనసాగుతున్న విధానాలను చర్చించడం జరిగిందని సుధాకర్ రెడ్డి తెలిపారు.

## కిషన్ రెడ్డి అరెస్ట్...

# హై డ్రామా

(మొదటి పేజీ తరువాయి)

సింగారంలోని డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించేందుకు.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఛలో బాట సింగారం కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఛలో బాట సింగారం కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తలకు దారితీసింది. ఉదయం నుంచే.. పోలీసులు బీజేపీ నేతలను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బాటసింగారం వెళ్తుండగా.. పోలీసులు కిషన్ రెడ్డితోపాటు.. రఘునందన్ రావు, పలువురు బీజేపీ రాష్ట్ర నేతలను అడ్డుకున్నారు. దీంతో కిషన్ రెడ్డి వర్షంలోనే రోడ్డుపై భైటాయించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో బీజేపీ కార్యకర్తలు , పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది.అనంతరం కిషన్ రెడ్డి సహా.. పలువురు నేతలను పోలీసులు అరెస్టు చేసి.. కేంద్రమంత్రి కాన్వాయ్ లోనే తరలించారు. నాంపల్లి బీజేపీ కార్యాలయానికి తరలిస్తున్నారు. కిషన్‌రెడ్డి, రఘునందన్ అరెస్టుకు ముందు.. నాయకులందరినీ పోలీసులు అదుపులోకి తీసుకుని తరలించారు. బీజేపీ నేతలు అందరినీ.. నగరంలోని పలు పోలీసు స్టేషన్లకు తరలించారు. కిషన్‌రెడ్డిని పోలీసులు అడ్డుకోవడంతో భగ్గుమన్న బీజేపీ కార్యకర్తలు.. పోలీసు వాహనాలకు అడ్డుగా నిల్చొని ఆందోళన చేశారు.అయితే, బాటసింగారం పోరుబాటకు పర్మిషన్ అడగలేదని.. అందుకే బీజేపీ నేతల ముందస్తు హౌస్ అరెస్ట్‌లు చేశామని పోలీసులు తెలిపారు. పార్టీ అధ్యక్షుడి హోదాలో కార్యక్రమానికి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారని.. ఇది పార్టీ పరమైన కార్యక్రమం కాబట్టే కిషన్‌రెడ్డిని అభ్యర్థించామని.. చివరకు అరెస్టు చేశామని తెలిపారు. దీంతో ఓఆర్ఆర్ పై ట్రాఫిక్ జామ్ అయింది.

**ఛలో బాట సింగారం**

ఛలో బాట సింగారం.. తెలంగాణ రాజకీయాలను మరింత హీటెక్కించింది. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి తలపెట్టిన 'ఛలో బాట సింగారం' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించేందుకు వెళుతున్న బీజేపీ నాయకులను ముందుస్తు అరెస్ట్ చేసిన పోలీసులు.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని అడ్డుకున్నారు. బాట సింగారం వెళ్తున్న కిణషన్ రెడ్డిని అడ్డుకోవడంతో.. ఆయన పోలీసులపై ఫైర్ అయ్యారు. ఎందుకు అడ్డుకుంటున్నారంటూ పోలీసులను నిలదీశారు. దీంతో శంషాబాద్ లో ఉద్రిక్తత కొనసాగుతోంది. బీజేపీ నేతలు ? పోలీసుల మధ్య వాగ్వాదం కొనసాగుతోంది. పోలీసులకు వ్యతిరేకంగా బీజేపీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఇప్పటికే పలువురని పోలీసులు అరెస్టు చేసిన పోలీసులు.. బాట సింగారం వెళ్లడానికి అనుమతి లేదంటూ పేర్కొంటున్నారు. చివరకు కిషన్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి.. పోలీస్ స్టేషన్ కు తరలిస్తున్నారు.ఛలో బాట సింగారానికి పిలుపునిస్తే ప్రభుత్వం అన్యాయంగా అరెస్ట్‌లు చేస్తోందని మండిపడ్డారు బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్. ఆంధ్రా పాలకులు ఇలాగే వ్యవహరిస్తే తెలంగాణ రాష్ట్రం వచ్చేదా అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ఇచ్చిన హామీ ప్రకారం పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని ఈటల డిమాండ్ చేశారు.

**పోలీసులు దుర్మార్గంగా ప్రవర్తన**

కేంద్రమంత్రి పట్ల తెలంగాణ పోలీసులు దుర్మార్గంగా ప్రవర్తించారని ఎమ్మెల్యే రఘునందన్‌రావు మండిపడ్డారు. కచ్చితంగా ప్రభుత్వం తీరుపై, పోలీసుల ప్రవర్తనపై కేంద్రానికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఓ వైపు పార్లమెంట్ నడుస్తుండగానే కేంద్రమంత్రిపై దురుసుగా ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేస్తుంటే ప్రతిపక్షంగా బీజేపీ అడగతం తప్పా అని నేతలు ప్రశ్నింస్తున్నారు. పరిశీలనకు వెళ్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. ఉదయం ఐదు గంటల నుంచే పోవలీసలులు తమ వాహనాలను తీసుకొచ్చి ఇళ్ల చుట్టూ మోహరించారని ఆరోపించారు డీకే అరుణ. బాటసింగారం వద్ద డబుల్ బెడ్ రూం ఇళ్ళను పరిశీలించాలని బీజేపీ నిర్ణయిస్తే జంటనగరాల్లో ఉన్న బీజేపీ నాయకులను పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు ఈటల రాజేందర్. ప్రతీసారి అధికార పార్టీకి ఇది అలవాటుగా మారిందన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు చేసే హక్కు ప్రతిపక్షాలకు ఉందని... ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చే బాధ్యత ఉంటుందని గుర్తు చేశారు. కేసీఆర్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తమను నిర్బంధించినంత మాత్రాన పోరాటం ఆగదని... కేసీఆర్ తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరని... అరెస్టులు కొత్తకాదని అభిప్రాయపడ్డారు.

# పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా ఎస్.రవీందర్ రెడ్డి


పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ రవీందర్ రెడ్డి

అబ్దుల్లాపూర్ మెట్ – ప్రభాత సూర్యుడు రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా ఎస్.రవీందర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పెద్ద అంబర్ పేట్ మున్సి పాలిటీ కమిషనర్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వహించిన బైరెడ్డి సత్యనారాయణ రెడ్డి ఖమ్మం మున్సి పాలిటీకి అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ కాగా, నల్గొండ జిల్లా నందికొండ మున్సిపాలిటీలో కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన రవీందర్ రెడ్డి పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీకి సాధారణ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. కౌన్సిల్ సభ్యుల సమన్వయంతో మున్సిపాలిటీ అభివృద్ధికి తోడ్పడుతానని అన్నారు.

# హైదరాబాద్ శివారు నార్సింగీ లో కార్ రేసింగ్

### కోకా పేట్ మూవీ టవర్స్ లో కారు రేసింగ్

రంగారెడ్డి – ప్రభాత సూర్యుడు : బ్రాండెడ్ కార్ల తో రేసింగ్ కు పాల్పడుతూ రేసర్స్ స్థానికులను భయభ్రాంతులను గురి చేస్తున్నారు. రూయ్ రూయ్ అంటూ మితిమీరిన వేగంతో కార్లు దూసుకుపోతున్నాయి. దాంతో స్థానికులు 100 ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేసారు. హుటాహుటిన రేసింగ్ స్పాట్ కు చేరుకున్న నార్సింగీ పోలీసులు, రేసింగ్ కు పాల్పడుతున్న వారిని అడ్డగించి కార్లను సీజ్ చేసారు. వాటిని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఆరుమందిని అదుపులోకి తీసుకు న్నారు. నార్సింగీ పోలీసులు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టుబడ్డ వారంతా బడా బాబుల పిల్లలుగా గుర్తించారు.

# గండిగూడెం చెరువులోని చేపలు మృతి

సంగారెడ్డి –ప్రభాత సూర్యుడు : సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ మండలం దయరా గ్రామంలోని గండిగూడెం పెద్ద చెరువు లో భారీ సంఖ్యలో చేపలు మృత్యువాత పడ్డాయి. మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అదే అదునుగా రసాయన పరిశ్రమల నుంచి చెరువులోకి విడుదల చేస్తున్న వ్యర్ధజలాలకు చేపలు చనిపోతున్నాయంటూ మత్స్య కారులు ఆందోళనకు దిగారు. గతంలో కూడా ఇలాగే రసాయన పరిశ్రమల నుంచి విడుదలైన వ్యర్ధ జలాలతో చేపలు మృతి చెందాయి. పిసిబి అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు.

# బీజేపి నేత రామచంద్ర రావు హౌస్ అరెస్టు

హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు : మాజీ ఎమ్మెల్సీ రాంచందరావును తార్నాకలోని అయన నివాసంలో ఓయూ పోలీసులు హౌస్ అరెస్టు చేసారు. రామచంద్ర రావు మాట్లాడుతూ కొన్ని లక్షల మంది డబుల్ బెడ్ రూమ్ ల కోసం ఎదురుచూస్తున్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఎందుకు ఆగిపోయాయో చూడడానికే మేము వెళ్తున్నాం. చూడడానికి వెళ్లకూడదా. రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతుందని అన్నారు. బాటసింగారం డబుల్ బెడ్ రూమ్ పర్యవేక్షణకు కిషన్ రెడ్డి పిలుపుమేరకు బీజేపీ నాయకులు అందరిని ఎక్కడికక్కడ అరెస్టులు చేస్తున్నారని అయన ధ్వజమెత్తారు. నగరం తో పాటు జిల్లాల నుండి వస్తున్న వారిని కూడా బిజెపి నాయకుల హౌస్ అరెస్టుల తోపాటు ఎక్కడికక్కడ అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. ప్రభుత్వం గత తొమ్మిది తొమ్మిదిన్నర సంవత్సరాలుగా డబుల్ బెడ్ రూమ్ లు ఇస్తానని ప్రజలను మభ్యపెడుతుందని అన్నారు.

# సిద్దిపేట జిల్లాలో కుంభవృష్టి

సిద్దిపేట – ప్రభాత సూర్యుడు : సిద్దిపేట జిల్లా చేర్యాల, ధూల్మిట్ట, కొమురవెల్లి మండలాల్లో భారీ వర్షాలు పడ్డాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఆకునూరు వద్ద మోహితుమ్మెద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కోహెడ మండలం బస్వపూర్ వద్ద బ్రిడ్జి పై నుండి నీళ్లు పారుతున్నాయి. వరంగల్ సిద్దిపేట మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

# ఉధృతంగా గోదావరి..అధికారులు అప్రమత్తం

భద్రాచలం – ప్రభాత సూర్యుడు : గత మూడు రోజులుగా ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో భద్రాచలం వద్ద నీటిమట్టం క్రమేపీ పెరుగుతుంది. బుధవారం రాత్రి 34 అడుగుల వద్ద వున్న గోదావరి గురువారం ఉదయానికి 39 అడుగుల వద్ద ప్రవహిస్తుంది.. 43 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక ప్రకటిస్తారు.. ఎగువన ఉన్న తాలిపేరు.. మేడిగడ్డ.. ప్రాజెక్ట్ ల నుండి భారీగా వరద నీటిని విడుదల చేయడం తో వరద మరింత పెరిగే అవకాశం వుందని అధికారులు అంచనా వేస్తున్నారు.. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.. నిన్న కలెక్టర్ ప్రియాంక ఆలా వరద పరిస్థితి పై అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించి తీసుకోవలసిన జాగర్తలు పై చర్చించారు.. పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు.

# లోతట్టు ప్రాంతాలు జలమయం




సికింద్రాబాద్ – ప్రభాత సూర్యుడు : గత మూడు రోజులనుండి నగరంలో కురుస్తున్న వర్షాలతో పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నగరవాసులు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. బేగంపేట్, పారడైస్ ,సికింద్రాబాద్ స్టేషన్, మొండా మార్కెట్, జనరల్ బజార్,సీతాఫలమండి, చిలకల గూడ ప్రాంతాలలో వర్షపు నీరు భారీగా నలిచిపోయింది.మరోవైపు భద్రాచంలో భారీ వర్షాల కారణంగా రామాలయం అన్నదాన సత్రం విస్తా కాంప్లెక్స్ ప్రాంతాలకు బ్యాక్ వాటర్ చేరుకుంది. దాంతో అధికారులు మోటర్లతో నీటిని తోడి గోదావరిలోకి విడిచిపెడుతున్నారు.

# పోలీసుల వ్యవహార శైలిపై ఎన్నికల కమిషనర్ కు ఫిర్యాదు చేస్తా

- రాజకీయాలను ప్రభావితం చేసేలా పోలీసులు, - రాజకీయ అనుబంధ సేవా సంస్థలతో పని చేయడం ఆక్షేపనీయం
- పోలీసులు స్వతంత్రంగా కార్యక్రమాలు నిర్వహిస్తే స్వాగతిస్తాం
- ఎన్నికల నియమావళి అమల్లోకి రానున్న తరుణంలో పోలీసుల తీరుపై జీవన్ రెడ్డి ఆగ్రహం
- అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి
-కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



జగిత్యాల – ప్రభాత సూర్యుడు : ఎల్.ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ తో కలిసి పోలీసులు కార్యక్రమాలు నిర్వహించటంపై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. గురువారం తన నివాసం, ఇందిరా భవన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు జరగనున్న తరుణంలో ప్రభుత్వ ఉద్యోగులు ఏ శాఖకు చెందిన వారైనా నిష్పక్షపాతంగా వ్యవహరించడం ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఉద్యోగుల బదిలీల ప్రక్రియ చేపట్టాలని ఇప్పటికే ప్రభుత్వానికి సూచించడంతో ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఎన్నికల్లో రెవెన్యూ శాఖ, పోలీసు శాఖ ప్రధాన మైనవని అన్నారు. ప్రభుత్వ అధికారులు, రెవెన్యూ, పోలీసులు శాఖలు నిష్పక్షపాతంగా వ్యవహ రించాల్సి ఉండగా ప్రజల్లో అపోహలు కలిగే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పోలీసు శాఖ ప్రజా సంబంద కార్యక్రమాలు, అవగాహన కార్య క్రమం, నిరుద్యోగులకు శిక్షణ నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. అయితే ఎన్నికలు నియామవళి అమలుకు రానున్న తరుణం లో అధి కారుల బదిలీల ప్రక్రియ జరుగుతున్న సమ యంలో పోలీసులు నిర్వహించే కార్యక్రమాలు, రాజ కీయాలను ప్రభావితం చేయడం పై ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రాజ కీయాలను ప్రభావితం చేసేలా పోలీసులు, సోషల్ సర్వీస్ సంస్థతో కార్యక్రమం నిర్వహించడం నాలుగు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో ఎన్నడు చూడలేదని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. స్వచంద సంస్థలు సేవా కార్యక్రమాలు చేపట్టడం వారి హక్కు, సేవా కార్యక్రమాలు చేయవద్దని చెప్పడం లేదని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే స్వచ్ఛందంగా సంస్థలు సేవా కార్యక్రమాలు నిర్వహి ంచుకోవడంపై తమకు ఎటువంటి అభ్యంతరాలు లేదన్నారు. సోషల్ ఆర్గనైజేషన్స్, రాజ కీయాలకు అనుబంధంగా సంస్థలు రాజకీయాల్లో ప్రభావిత చేసే అవకాశం ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా, స్వతంత్రంగా, నిష్పా క్షపాతంగా కంగా వ్యవహ రించాల్సిన పోలీసులు. ఎన్నికల నియమావళి అమలుకు రాబోతున్న సమయంలో ధర్మపురి లో మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి స్నేహ లత అధ్వర్యంలో కార్యక్రమాలు చేయడాన్ని తప్పుబట్టారు. రాజకీయాలను ప్రభావితం చేసే రాజకీయ అనుబంద సంస్థఎల్ ఎం కొప్పుల ఆర్గనైజేషన్‌తో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం ఆశ్చ ర్యకరమన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించడంలో పోలీసులు స్వతంత్రంగా నిర్వహి ంచాలన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యు వతకు ఉద్యోగాల కల్పనను అభిన ందిస్తా మన్నారు. ప్రభుత్వ అధికార యంత్రాంగం పక్షపాత ధోరణి తో వ్యవహరిస్తే అదుపు చేయాల్సిన జిల్లా స్థాయి అధికారి పై ఉంటుందన్నారు. జిల్లా స్థాయి అధికారెడ్డి నియమాలను ఉల్లంఘించి, కింది స్థాయి అధికారులకు ఏవిధమైన సంకేతాలు ఇవ్వాలను ఒకుంటున్నారని ప్రశ్నించారు.తాము ఏది మాట్లాడిన లిఖిత పూర్వకంగా ఆధారాలతో మాట్లాడు తామన్నారు. త్వరలో మరో ఎపిసోడ్ విడుదల చేస్తా మన్నారు. నియమాలు ఉల్లంఘనలపై ఎన్నికల అధి కారుల దృష్టి కి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ లో ప్రత్యేక విభాగం 24 గంటలు పని చేస్తోందన్నారు. ఉద్యో గులు నియమ నిబంధనలకు అనుగుణంగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సవిన యంగా విజ్ఞప్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమారు,పిసిసి సభ్యులు గిరి నాగభూషణం, బండ శంకర్, గాజంగి నందయ్య, కల్లేపల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, మన్సూర్, నేహాల్, చందా రాధాకిషన్, దరా రమేష్ బాబు, కాటిపెల్లి శ్రీనివాస్ రెడ్డి,బొల్లి శేఖర్, రఘువీర్ గౌడ్ మామిడిపల్లి మహిపాల్, బిరం రాజేష్, పాల్గొన్నారు.

### ప్రతీ ఓటరు ఎలక్ట్రానిక్

# ఓటింగ్ యంత్రాల పై అవగాహన కలిగి ఉండాలి

### జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా




జగిత్యాల – ప్రభాత సూర్యుడు : వచ్చే ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వినియోగం పై ఓటర్లకు అవగాహన కార్యక్రమాలను జిల్లా లోని అన్ని నియోజక వర్గాలలో నిర్వహిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తెలిపారు. ఓటింగ్ యంత్రాల ద్వారా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునే విధానం పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక వాహనాల ద్వారా విస్తృత ప్రచార కార్యక్రమాలను గురువారం రోజున సమీకృత కలెక్టరేట్‌లో జెండా ఊపి కలెక్టర్, అదనపు కలెక్టర్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతీ ఒక్క ఓటరు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించడానికి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక వాహనాల ద్వారా జిల్లాలోని నియోజక వర్గాల పరిధిలోని ఓటర్లకు ప్రయోగాత్మకంగా అవ గాహన కల్పించనున్నమని, అందులో భాగంగా ఈ రోజు నుండి ఎన్నికల షెడ్యూల్ వెలువడే వరకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్.లత, కలెక్టరేట్ పరిపాలన అధికారి నాగార్జున, డీపీఆర్వో ఎన్.భీమ్ కుమార్, అదనపు పి. డి. నరేష్, కలెక్టరేట్ పర్యవేక్షకులు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### వర్షం నేపథ్యంలో జీహెచ్ఎంసీ

# కమిషనర్ రోనాల్డ్ రాస్ సమీక్ష

### అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దు



హైదరాబాద్ – ప్రభాత సూర్యుడు : రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో గురువారం తెల్లవారుజాము నుంచి కుండపోత వర్షం కురుస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి జోనల్ కమిషనర్లు, అడిషనల్ కమిషనర్లు, ఇంజినీర్లు హాజరయ్యారు. వాటర్ లాగింగ్, చెట్లు విరిగిపోయాయని వస్తున్న ఫిర్యాదులు పరిష్కరించాలని అధికారులను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశించారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని రోనాల్డ్ రాస్ హెచ్చరించారు.శిథిలావస్థకు చేరిన భవనాల్లో ప్రజలు ఉండకూడదని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి ఆదేశించారు. అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు. హైదరాబాద్ నగరమంతా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో లింగంపల్లి నుంచి గచ్చిబౌలి వెళ్లేదారిలో రైల్వే బ్రిడ్జి కింద భారీగా వర్షపు నీరు వచ్చి చేరింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీనికి సంబంధించి అర్ధరాత్రి డీఆర్ఎఫ్ టీమ్స్‌కు 50 ఫిర్యాదులు అందాయి. వర్షపు నీటికి పురాతన భవనాలు చాలావరకు తడిసిపోయాయి.మియాపూర్‌లో 7.38 సెం.మీ., టోలీచౌకి 6.65 సెం.మీ., హైదర్‌నగర్ 5.68 సెం.మీ., మాదాపూర్ 5 సెం.మీ., కేపీహెచ్‌బీ 4.95 సెం.మీ., మూసాపేట 4.73 సెం.మీ., జూబ్లీహిల్స్ 4.65 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

# ఆరోగ్య శ్రీ పై కేసీఆర్ సవతి ప్రేమ

### కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్



మెట్ పల్లి – ప్రభాత సూర్యుడు : ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్య శ్రీ పథకం పై సవతి ప్రేమ చూపెడుతున్నాడని కాంగ్రెస్ పార్టీ మెట్ పల్లి పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ ఖుతుబోద్దిన్ పాషా అన్నారు.గురువారం టీపీసీసీ డెలిగెట్ కల్వకుంట్ల సుజిత్ రావు నివాసం లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వైఎస్ రాజశేఖర్ రెడ్డి తెచ్చిన పథకాలు అద్భుతమని..వాటి అమలులో పిచ్చి భేషజాలు లేవని..అసెంబ్లీ వేదికగా గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఇన్నాళ్లు చెప్పిందొకటి .చేసిందొకటి. పైకి కపట ప్రేమను నటిస్తూ లోపల కాలకూట విషాన్ని చిమ్మిండు. సంజీవనిలా పనికొచ్చే రాజీవ్ ఆరోగ్యశ్రీని కోమాలో పెట్టి అనారోగ్యశ్రీగా మార్చి పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని దూరం చేశాడని ఏటికేటా బిల్లులు చెల్లించక రాజీవ్ ఆరోగ్యశ్రీ పేరు చెప్తేనే కేసులు పట్టకుండా చేశాడని కంటికి పంటికి జబ్బు చేస్తే ఢిల్లీకి,కార్పొరేట్ దవాఖానకు పరుగులు పెట్టే కేసీఆర్. పేదోడికి దక్కాల్సిన కార్పొరేట్ వైద్యాన్ని చంపి వేసాడు.ఉచిత వైద్యం అందిచాల్సిన సర్కారీ దవాఖానలకే పథకాన్ని పరిమితం చేసి. తొమ్మిదేండ్లుగా రాజీవ్ ఆరోగ్యశ్రీని అమలు చేయకుండా లక్షల మంది ప్రాణాలు తీసిన పాపం కెసిఆర్ ది అని. కరోనాలాంటి విపత్కర పరిస్థితిలోనూ బకాయిలు చెల్లించకుండా వేలాది మంది పేదల చావులకు ప్రత్యక్ష కారకుడ య్యాడన్నరు. ఇన్నాళ్లు ఆరోగ్య శ్రీ పథకంపై సవతి తల్లి ప్రేమ చూపిన ముఖ్యమంత్రి కి ఉన్నట్లుండి ప్రేమ పుట్టుకొచ్చిందని. ఆరోగ్యశ్రీ ఇయ్యకుంటే ఎన్నికల్లో ప్రజలు తన్ని తరుముతరని అర్థమైందని. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరోగ్యశ్రీకి 5 లక్షల ప్రీమియం చెల్లిస్తామని అనడంతో కెసీఆర్ 2 లక్షల నుంచి ప్రీమియాన్ని రూ.5 లక్షలకు పెంచిండు పని చేయని పథకానికి అంకెల్లో ప్రీమియం పెంచి ఏదో ఉద్ధరించినట్లు ఇప్పుడు బిల్డప్పులు ఇస్తున్నడని.ఎన్నికల జిమ్మిక్కులు, నక్క తెలివితేటలు ఇప్పటికైనా పక్కన పెట్టి. ప్రజల ప్రాణాలతో నీచ రాజకీయాలు చేయడం ఆపి తక్షణం ఆరోగ్యశ్రీని అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో అమలు చేయాలని. ఆసుపత్రులకు పెండింగ్ బకాయిలు 800 కోట్లు చెల్లించి. ఇచ్చిన మాట ప్రకారమైనా 5 లక్షల ప్రీమియాన్ని ఆపకుండా అమలు చేయాలని డిమాండ్ చేశాడు.ఈ కార్యక్రమంలో ముద్దం ప్రశాంత్, కోరే రాజకుమార్,నీరేటి రాజు,బండమిది గంగాధర్,రవి కిషోర్,ఎండి. అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణా వ్యాప్తంగా భారీ వర్షాలు

హైదరాబాద్ –ప్రభాత సూర్యుడు :

తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు నమోదయ్యాయి. హైదరాబాద్ లో 75 గంటలుగా ఎడతెరిపి లేని వర్షం కురిసింది. నాలాలు పొంగడంతో పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారాలు నీట మునిగాయి. నగరవాసులు అప్రమత్తంగా ఉండాలంటూ జిహెచ్ ఎంసీ హెచ్చరికలు జారీ చేసింది. హైదరాబాద్ లో పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. గురువారం నాడు జిహెచ్ ఎంసీకి 60కి పైగా ఫిర్యాదులు అందాయి. మాదాపూర్ 5 సెం.మీ, కెపిహెచ్ బి 4.98 సెం.మీ, మూసాపేట 4.73 సెం.మీ, జూబ్లీ హిల్స్ 4.65 సెం.మీ. మియాపూర్ లో 7.40 సెం.మీ.వర్షపాతం. టోలీ చౌకీ 6.65 సె.మీ, హైదరాదాద్ 5.68 సెం.మీ వర్షపాతం నమోదయింది.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215